

ఉత్తమ పశువైద్య సేవా అవార్డు అందజేత



అవార్డు అందుకుంటున్న డాక్టర్ బిందు

ప్రజాశక్తి - కె.గంగవరం

ప్రపంచ పశు వైద్య దినోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బిఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఉత్తమ పశు వైద్య సేవలు అందించిన డాక్టర్ ఎం.బిందు కు ఈ అవార్డు లభించింది. ఆమె రామచంద్రపురం నియోజకవర్గం పరిధిలోని పామర్రు వైద్యశాలలో పనిచేస్తున్నారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో జిల్లా పసు సంవర్ధక శాఖ అధికారి ఎం.వెంకట్రావు చేతుల మీదుగా ఉత్తమ పశువైద్య సేవలు అవార్డు ను అందజేశారు. అవార్డు అందుకున్న డాక్టర్ బిందును ద్రాక్షారామ పశువైద్యులు కష్ణార్జున, అసిస్టెంట్ డైరెక్టర్ రామకష్ణ, కె.గంగవరం ,రామచంద్రపురం పశు వైద్యులు తదితరులు అభినందనలు తెలిపారు.

డిసిసిబి పీఠం ఎవరికో..?

- పోటీ పడుతున్న ముఖ్య నేతలు
- విశ్వ ప్రయత్నాల్లో జ్యోతుల, పిల్లి
- తమకే కావాలంటున్న టిడిపి, జనసేన



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ది జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ లిమిటెడ్ (డిసిసిబి) ఛైర్మన్ పీఠం కోసం పలువురు కూటమి నేతలు విశ్వ ప్రయత్నాలు సాగిస్తున్నారు. తమకంటే తమకే పీఠం దక్కాలనే ఆశలతో అటు టిడిపి అన్ని రకాల ప్రయత్నాలు చేస్తుండగా ఇటు జనసేన సైతం తామేమి తక్కువ అన్నట్లుగా ఆ పార్టీ నేతలు తరతమ స్థాయిలో పావులు కదుపుతున్నారు. త్వరలోనే మరికొన్ని నామినేటెడ్ పదవులను కూటమి సర్కారు భర్తీ చేయనున్న నేపథ్యంలో ఈ పీఠం ఎవరికి దక్కుతుందనేది చర్చనీయాంశంగా మారింది.

కూటమి ప్రభుత్వం డిసిసిబి, డిసిఎంఎస్ పదవులను త్వరలోనే భర్తీ చేయడానికి సిద్ధంగా ఉంది. దీనిలో డిసిసిబి పదవి ప్రధానంగా మారింది. ప్రతి ఏడాది సుమారు రూ.10 వేల కోట్ల టర్నోవర్‌తో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రైతులందరితో డిసిసిబి అనుబంధం కలిగి ఉంది. ఈ నేపథ్యంలో దీని అధ్యక్ష పదవి ఎంతో కీలకంగా మారింది. దీనికి ఛైర్మన్‌గా పని చేస్తే తగిన గౌరవం, హోదా దక్కుతుందని అంతా భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ పదవి కోసం గట్టి పోటీ నెలకొంది. అనేకమంది ఆశావహులు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల కొన్ని నామినేటెడ్ పదవులను భర్తీ చేసినప్పటికీ కొంతమంది ఆసవాహలకు ఎటువంటి పదవి దక్కలేదు. సార్వత్రిక ఎన్నికల్లో పలు నియోజకవర్గాల్లో సీట్లు ఆశించిన వారికి నిరాశే మిగిలింది. టిడిపి జిల్లా అధ్యక్షుడుగా ఉన్న మెట్ట ప్రాంతానికి చెందిన జ్యోతుల నవీన్ కాకినాడ ఎంపీ సీటుని ఆశించారు. కానీ పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించారు. ప్రస్తుతం ఆయన డిసిసిబి ఛైర్మన్ పదవి ఇవ్వాలని ఆయన అనుచరులు కొంతకాలంగా గట్టిగా కోరుతున్నారు. నవీన్ కూడా తనకు తగిన గుర్తింపు ఇవ్వాల్సిందిగా సందర్భం వచ్చినప్పుడల్లా అటు చంద్రబాబు, ఇటు లోకేష్ వద్ద ప్రస్తావనకు తీసుకుని వస్తున్నట్లుగా తెలుస్తోంది.

మరోవైపు కాకినాడ రూరల్ మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి భర్త పిల్లి సత్తిబాబు తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు. పొత్తులో భాగంగా రూరల్ అసెంబ్లీ నియోజకవర్గ సీటుని జనసేనకు కేటాయించగా సీనియర్ నేతగా ఉన్న తనకు కీలక పదవి లభిస్తుందని సత్తిబాబు ఎప్పటినుంచో ఆశిస్తున్నారు. దానికి తగ్గట్లుగానే ఈసారి డిసిసిబి పదవిని బిసిలకు ఇవ్వాలనే డిమాండ్‌ను ఆయన తెరమీదకు తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలోనే టిడిపి అధిష్ఠానం వద్ద తన ప్రతిపాదనను పెట్టి పదవి కోసం పైరవీలను ముమ్మరం చేశారు. పెద్దాపురం ఎంఎల్ఎ చినరాజప్ప కూడా సత్తిబాబుకు అవకాశం ఇవ్వాలని, దీని ద్వారా సామాజిక సమతుల్యత ఏర్పడుతుందని అధిష్ఠానం వద్ద తెలియజేసినట్లు ప్రచారం జరుగుతుంది. ఆయనతో పాటు, మరికొంతమంది ఎంఎల్ఎలు పిల్లికి మద్దతు తెలుపుతున్నట్లుగా సమాచారం.

మాజీ మంత్రి కుమారుని ఆశలు

కోనసీమ ప్రాంతానికి చెందిన సీనియర్ నేత, దివంగత మాజీ మంత్రి మెట్ల సత్యనారాయణ కుమారుడు మెట్ల రమణబాబు డిసిసిబి ఛైర్మన్ పదవి కోసం గత కొన్నేళ్లుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు కాంగ్రెస్ అధికారంలో ఉండగా డిసిసిబికి జరిగిన ఎన్నికల్లో టిడిపి తరపున రమణబాబు పోటీ చేసి విజయం సాధించలేకపోయారు. కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన దివంగత వరుపుల రాజాకి ఈ పదవి దక్కింది. 2014-19 మధ్య టిడిపి అధికారంలో ఉన్నప్పటికీ ఆయనకు ఈ పదవి దక్కలేదు. దీంతో ఈసారైనా ఛైర్మన్ అవకాశం వస్తుందనే ఆశలతో ఆయన ప్రయత్నాలు గట్టిగానే జరుపుతున్నారు. అయితే ఎప్పుడూ ఈ పదవిని కాపు సామాజిక వర్గానికే కేటాయిస్తున్నందున ఈసారి బిసిలకు అవకాశం ఇవ్వాలనే ప్రతిపాదన తెరమీదకు వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో రమణబాబు ఆశలు నెరవేరే అవకాశం కనిపించడం లేదు.

పట్టు కోసం జనసేన

రాష్ట్ర డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ కాకినాడ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పిఠాపురం ఎంఎల్ఎగా ఆయన పని చేస్తున్నారు. పార్టీని ఉమ్మడి జిల్లాలో మరింత బలోపేతం చేయాలని జనసేన అధిష్టానం ఆశిస్తోంది. ఈ నేపథ్యంలోనే కూటమిలో భాగంగా ఉన్న జనసేన కీలక పదవులను తీసుకునేందుకు గట్టిగా పట్టు బిగిస్తోంది. ఇప్పటికే కుడా ఛైర్మన్ పదవితో పాటు సివిల్ సప్లై కార్పొరేషన్ ఛైర్మన్ పదవిని జనసేన నాయకులే తీసుకున్నారు. ప్రస్తుతం డిసిసిబి ఛైర్మన్ పదవిని తమ పార్టీ ఖాతాలో వేసుకోవాలని పార్టీ ముఖ్య నేతలు భావిస్తున్నారు. ఇటీవల జిల్లాకు వచ్చిన పవన్ కల్యాణ్ వద్ద ఈ విషయాన్ని జిల్లా నేతలు ప్రస్తావించినట్లు సమాచారం. ఇలా డిసిసిబి పదవి కోసం ఎవరి ప్రయత్నాల్లో వారున్నారు. పీఠం ఎవరికి దక్కుతుందనేది ప్రస్తుతానికి ఆసక్తికరంగా మారింది.

మేడేను ఘనంగా నిర్వహించాలి



బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న సిఐటియు, ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి - కాట్రేనికోన

మేడేను మండలంలో ఘనంగా నిర్వహించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం కాట్రేనికోన మండలం సిఐటియు, ప్రజాసంఘాల ముఖ్య నాయకులు సమావేశం విపర్తి మోహన్ రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ మేడే కార్మిక దినోత్సవం సందర్భంగా మండల ంలో అన్ని యూనియన్లు కలిపి భారీ బహిరంగ సభ, ప్రదర్శన నిర్వహించాలన్నారు. మే 20న కార్మిక లేబర్ కోడ్లు రద్దు చేయాలని సిఐటియు, కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో, దేశంలో కార్మిక వర్గ వ్యతిరేక నిర్ణయాలు పాలకుల చేస్తున్నారని ఈ దేశ సంపదను సృష్టిస్తున్న కార్మిక వర్గానికి అన్యాయం చేస్తున్నారని రైతు పండించే పంటకు గిట్టుబాటు ధర లేకుండా, నిరుద్యోగులకు ఉపాధి లేకుండా చేస్తున్నారని విమర్శించారు. బ్రిటిష్ కాలం నాటి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేయాలని మోది ప్రభుత్వం పార్లమెంట్లో బిల్లు పెడితే కాంగ్రెస్, టిడిపి, వైసిపిలు బలపరచడం సిగ్గుచేటు అన్నారు. ఈ పార్టీలు కార్మిక వర్గం కోసం మేలు చేస్తామని గొప్పలు చెప్పుకుంటున్న ఈ పార్టీలన్నీ కార్మిక వర్గానికి ద్రోహం చేసే పార్టీలని విమర్శించారు. అనంతరం మే 20 సమ్మె ప్రాముఖ్యతను వివరిస్తూ సిఐటియు రాష్ట్ర కమిటీ ముద్రించిన బుక్ లెట్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బడుగు భీమేశ్వరరావు, గంజా సత్తిబాబు, బొంతు పార్వతి, మట్టా నాగరత్నం, మాదే దుర్గ భవాని, మల్లు వెంకటలక్ష్మి, బొంతు దుర్గాప్రసాద్, రాయుడు కృష్ణ, కొడమంచిలి శ్రీనివాసరావు, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 85 మంది ఎంపిక



జాబ్ మేళాలో నియామక పత్రాలు అందిస్తున్న మంత్రి సుభాష్

ప్రజాశక్తి - రామచంద్రపురం

స్థానిక ఉపాధి కార్యాలయంలో ఈనెల 26, 27 తేదీల్లో నిర్వహించిన జాబ్ మేళాలో 85 మంది ఎంపిక అయ్యారు. వివిధ కంపెనీలకు ఎంపికైన వారికి ఆదివారం సాయంత్రం నియామక పత్రాలు అందించారు. ఈ జాబ్ మేళాలో అమర్ రాజా, హీరో మోటో కార్ప్, లక్స్‌షేర్ కంపెనీల ప్రతినిధుల హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేశారు. ఎంపికైన వారు చిత్తూరు, తడ, శ్రీ సిటీ, తమిళనాడు తదితర ప్రాంతాల్లో పనిచేయనున్నారు. వీరికి రూ. 20 వేలు నుంచి రూ.22 వేలు వరకు వేతనం అందిస్తారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడు తూ రామచంద్రపురం నియోజక వర్గంలో నిరుద్యోగ సమస్యను సమూలంగా రూపుమాపేందుకు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. రాష్ట్రంలోని పలు కంపెనీలతో ఒప్పందం చేసుకొని దశలవారీగా జాబ్ మేళాలు నిర్వహించి నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నామన్నారు. ఉపాధి కల్పన నిరంతర ప్రక్రియగా సాగిస్తామన్నారు. ఇంటర్వ్యూలో ఎన్నికైన అభ్యర్థులకు మంత్రి సుభాష్ శుభాకాంక్షలు తెలియజేశారు.

పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత సీట్లు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రయివేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 1వ తరగతిలో 25శాతం ఉచిత ప్రవేశాలకు అర్హులైన వారు దరఖాస్తూ చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారులు డి.గౌరీ శంకర్, ఆర్.ఉదయ భాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రయివేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో పేద కుటుంబాలకు చెందిన చిన్నారులకు 1వ తరగతిలో 25 శాతం ఉచిత సీట్లు కేటాయిస్తారన్నారు. వీరిలో 10 శాతం ఎస్‌సిలకు, 4 శాతం ఎస్‌టిలకు, బిసి, మైనారీ, ఇతరులకు 6 శాతం, హెచ్ఐవి భాధితులకు, వికలాంగులకు, అనాథలకు 5 శాతం సీట్లు కేటాయించబడ్డాయన్నారు. దీనికి దరఖాస్తు చేసుకునేవారు గ్రామీణ ప్రాంతానికి చర్మదిన వారైతే రూ.1.20 లక్షలలోపు, పట్టణ ప్రాంతానికి చర్మదిన వారైతే రూ.1.44 లక్షల లోపు ఆదాయ పరిమితి గళ వారాయి ఉండాలన్నారు. ఏప్రిల్ 28 నుంచి మే 15 వరకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. మే 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు దరఖాస్తుల పరిశీలన జరుగుతుందన్నారు. మే 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు మొదటి విడత జాబితా లాటరీ ద్వారా ప్రకటిస్తారన్నారు.ఎంపికైన అభ్యర్థులను జూన్ 2వ తేదీ నుంచి పాఠశాలలో చేర్చుకోవాలన్నారు. జూన్ 6న రెండో విడత లాటరీ ప్రక్రియలో ప్రకటించిన వారు జూన్ 12న పాఠశాలల్లో చేర్చుకుంటారన్నారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మత్స్యకారుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - కొత్తపేట

మత్స్య కారుల అభివృద్ధే ప్రభుత్వం ధ్యేయమని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. ఎన్నికల్లో హామీ మేరకు వేట నిషేధ సమయంలో రూ. 20 వేలు సాయం విడుదల...1,29,178 మత్స్యకార కుటుంబాలకు రూ.259 కోట్ల లబ్ధి. చేకూరుతుందని ఆయన అన్నారు. ఆయన విలేకరులతో ఆదివారం మాట్లాడుతూ మత్స్యకారుల సేవలో పథకాన్ని సిఎం చంద్రబాబు ఈ నెల 26న ప్రారంభించారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వేట నిషేధ సమయంలో ఆర్థికసాయం రెట్టింపు చేసి.. విడుదల చేశారన్నారు. దీని వల్ల 1,29,178 మత్స్యకార కుటుంబాలకు రూ.259 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. సముద్రంలో వేట నిషేధ సమయంలో మత్స్యకారులు ఇబ్బందులు పడకుండా ఆర్థిక సాయం చేయాలని నిర్ణయించామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వేట విరామ సమయంలో మత్స్యకారులకు ఆర్థిక సాయాన్ని రూ.10 వేలు నుంచి రూ.20వేలకు పెంచామన్నారు. ప్రజలందరికీ సంక్షేమం అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. రాష్ట్రంలో 68,396 మంది మత్స్యకారులకు నెలనెలా పింఛన్లు అందిస్తున్నామన్నారు. మత్స్య కారులు చేపల వేట సమయంలో మరణిస్తే రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లిస్తున్నామన్నారు. వేటకు వెళ్లే బోట్లకు లీటర్ డీజిల్‌పై రూ.9 సబ్సిడీ ఇస్తున్నామని ఆయన అన్నారు. గత పాలకులు ఫిష్ ఆంధ్ర పేరుతో రూ. 300 కోట్లు ఖర్చు పెట్టారన్నారని, ఒక్క మత్స్యకారుని కుటుంబమైనా బాగుపడిందా ఎంఎల్ఎ సత్యానందరావు విమర్శించారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి



ఉడిమూడిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎంఎల్ఎ గిడ్డి

ప్రజాశక్తి - మామిడికుదురు

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ అన్నారు. పి.గన్నవరం మండలంలోని ఉడిమూడిలో ఆదివారం జరిగిన అంబేద్కర్ జయంతి ఉత్సవాలలో ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ విలువలను కాపాడడమే మహనీయుడు అంబేద్కర్‌కు మన మిచ్చే నివాళులు అని అన్నారు. అంబేద్కర్ చిన్న వయస్సులో కలిగిన వివక్షకు కుంగిపోకుండా ఎంతో కష్టపడి చదివి మన దేశానికి గొప్ప రాజ్యాంగాన్ని రచించారన్నారు. ఈ రాజ్యాంగం వల్లే నేను ఈ రోజు శాసన సభ్యునిగా ఉన్నానని అన్నారు. దళితులు ఆర్థికాభివృద్ధికి అవసరమయ్యే సబ్ ప్లాన్ నిధులు గానీ, విదేశీ విద్య లాంటి పథకాలు నేడు కూటమి ప్రభుత్వం అమలు చేసి అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లేందుక కషి చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, జైభీమ్ యువత, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి చెక్కు అందజేత



రూ.5 లక్షల చెక్కు అందజేస్తున్న ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు

ప్రజాశక్తి- కపిలేశ్వరపురం, మండపేట

రోడ్డు ప్రమాదంలో రమణ ఇటీవల మృతి చెందాడు. మృతుడు రమణ కుటుంబానికి రూ 5 లక్షలు చెక్కును ఆదివారం రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు అందజేశారు. మండపేట నియోజకవర్గ రాయవరం మండలం, వెదురుపాక సావరం గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త వెలుబుడి రమణ రోడ్డు ప్రమాదంలో మరణించగా కుటుంబానికి మంజూరు అయిన టిడిపి సభ్యత్వ ఇన్సూరెన్స్ సొమ్ము రూ.5 లక్షల చెక్కును ఎంఎల్ఎ వేగుళ్ల వి.సావరం గ్రామంలో మృతుని ఇంటివద్దకు వెళ్లి వారి కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా మృతుడు రమణ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ కష్టకాలంలో తమ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకున్నందుకు సిఎం నారా చంద్రబాబుకు, మంత్రి నారా లోకేష్‌కు, ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు కు వారు కతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిల్లి గణేష్, రాయుడు ప్రసాద్, వెలగల వీర్రెడ్డి, కొవ్వూరి భాస్కరరెడ్డి, గుత్తుల శ్రీనివాస్, అల్లూరి రామకృష్ణ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

పదిలో మొగలికుదురు విద్యార్థిని ప్రతిభ



విద్యార్థిని మహాలక్ష్మి అభినందిస్తున్న ఎస్‌సి వెల్ఫేర్ అసోసియేషన్

ప్రజాశక్తి - మామిడికుదురు

ఇటీవల జరిగిన టెన్త్ పరీక్షల్లో మండల సాయిలో కొల్లాబత్తుల మహాలక్ష్మి (586) మార్కులతో మొగలికుదురు హైస్కూల్ నుంచి మండలంలోనే ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించింది. మహాలక్ష్మికి, తండ్రి కొల్లాబత్తుల మధుహసన్ కుటుంబ సభ్యులకు వారి ఇంటి వద్ద ఎపిఎస్‌సి వెల్ఫేర్ అసోసియేషన్ మండల శాఖ శుభాకాంక్షలు తెలియజేసి శాలువా కప్పి, అంబేద్కర్ చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేసి అభినందించారు ఆమె మరింత ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు భూపతి మనోహర్ రాజు, ప్రధాన కార్యదర్శి కారుపల్లి కళ్యాణ్ బాబు, గౌరవ అధ్యక్షులు పెయ్యల వీరబాద్రరావు, జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల రమేష్ బాబు, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి బయ్య మోహన్, జిడ్డి సుబ్బరాజు,నేల శ్రీనివాస్, తరపట్ల గణపతిరావు, మంగం రామకృష్ణ, కత్తుల శివప్రసాద్, ఉంద్రు శ్రీ రమణ, తదితర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన పైప్‌లైన్ మరమ్మతులు

ప్రజాశక్తి - ముమ్మిడివరం


మంచినీటి ట్యాంక్ ప్రధాన పైప్ లైను లీకుల మరమ్మతు పనులను ఆదివారం యుద్ధ ప్రాతిపదికన చేపట్టినట్లు నగర పంచాయతీ ఎఇ పివి.సుధాకర్ తెలిపారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక బస్ స్టాండ్ సెంటర్లోని విష్ణాలయం వద్ద జాతీయ రహదారి 216పై ప్రధాన పైప్‌లైన్‌కు ఏర్పడ్డ లీకుల మరమ్మతుల పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. ఈ మరమ్మతుల కారణంగా ఈ పైపు లైన్ ద్వారా సరఫరా జరిగే 4, 5, 6, 17, 18, 19 వార్డులకు నీటి సరఫరా జరగదన్నారు. మరమ్మతు పనులు మూడు రోజుల్లో త్వరితగతిన పూర్తి చేసి బుధవారం నాటికి మంచినీటి సరఫరాను పునరుద్ధరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అప్పటి వరకు ట్రాక్టర్ ట్యాంకర్ ద్వారా నీటి సరఫరాకు చర్యలు తీసుకున్నామని ఎఇ తెలిపారు. ఈ పనుల నిరంతర పర్యవేక్షణకు వార్డు ఎమినిటీ సెక్రటరీ రామ్, శానిటరీ సెక్రటరీ విజయ భాస్కర్ లను నియమించినట్లు తెలిపారు.

నేడు యథావిధిగా 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

ప్రజాశక్తి - అమలాపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్ర మం ఈనెల 28 సోమవారం ఉదయం 10 గంటల నుండి యథావిధిగా స్థానిక కలెక్టరేట్లో ని గోదావరి భవన్ నందు నిర్వహిస్తారని కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో సమస్యలు ఉన్న అర్జీదారులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకు వచ్చి పరిష్కార మార్గాలు పొందాలని ఆయన సూచించారు. జిల్లా స్థాయి కార్యక్రమంతో పాటుగా మూడు రెవెన్యూ డివిజన్లు, నాలుగు మున్సిపల్ కార్యాలయాలు మండల స్థాయిలో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. ఆయా స్థాయి సమస్యలను ఆయా వేదిక లకు అందించి పరిష్కార మార్గాలు కోరాలని కలెక్టర్ తెలిపారు.

కార్టూ'నిజం'



శ్మశానాన్ని ప్రారంభించనున్న మంత్రి

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు



కపిలేశ్వరపురం శాఖా గ్రంథాలయం

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో శాఖా గ్రంథాలయాల్లో ఈ నెల 28వ తేదీ నుంచి (సోమవారం) వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించనున్నారు. ఈ శిబిరాలు జూన్ 6వ తేదీ వరకు నిర్వహిస్తారని గ్రంథాలయ అధికారులు తెలిపారు.

కపిలేశ్వరపురం : స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం నుంచి జిల్లా గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారిణి డి. శివకుమార్ తెలిపారు. ఆదివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ శాఖ గ్రంధాలయంలో పుస్తక పఠనం ద్వారా విద్యార్థిని, విద్యార్థులను, విద్యావంతులు చేసేందుకు వేసవి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసిందన్నారు. ఈనెల 28 నుండి జూన్ 6వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరం జరుగుతుందన్నారు. ఈ శిబిరంలో పాఠశాలల విద్యార్థులకు కథలు చదవడం, డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లీష్, సంగీతం తదితర అంశములపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఈ శిక్షణ కార్యక్రమాన్ని విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. **ఉప్పలగుప్తం:** ఏప్రిల్ 28 నుంచి జూన్ 6 వరకు గ్రంథాలయాలలో నిర్వహించే వేసవి విజ్ఞాన తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఉప్పలగుప్తం, భీమనపల్లి శాఖా గ్రంథాలయ అధికారులు సలాది నాగేశ్వరరావు, నిమ్మకాయల శేషు కుమార్‌లు కోరారు.ఆ దివారం వారు విలేకరులతో మాట్లాడు శిక్షణా తరగతులు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ జరుగుతాయని ప్రతి రోజూ కథలు చెప్పడం, వినడం, పుస్తక సమీక్ష, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పెయింటింగ్ వంటి వాటిలో శిక్షణ ఇస్తారని తెలిపారు. విద్యార్థులకు వేసవి క్యాంపు అనంతరం సర్టిఫికెట్లు, బహుమతులు అందజేస్తామన్నారు. శిక్షణా తరగతులకు తమ విద్యార్థులను తప్పకుండా గ్రంథాలయానికి వచ్చే విధంగా ఉపాధ్యాయులు సహకరించాలని అలాగే విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమ పిల్లల్ని ఈ శిక్షణ తరగతులకు పంపించేలా శ్రద్ధ వహించాలని కోరారు. ఈ శిక్షణా తరగతులకు విద్యార్థులకు అల్పాహారం, బహుమతులు అందించే దాతలు, గ్రంథాలయానికి ఉచితంగా గ్రంథాలు అందజేసేవారు విలువైన ఫర్నీచర్, పుస్తకాలు మొదలైన వాటిని ఇచ్చే దాతలు తమకు తెలియజేయాలని కోరారు. శిక్షణ తరగతులలో స్పోకెన్ ఇంగ్లీష్, కథలు చెప్పడం వంటి వాటిలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడానికి విశ్రాంత ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లు, ఉద్యోగులు, మేధావులు స్వచ్ఛందంగా పాల్గొని విద్యార్థులకు శిక్షణ ఇవ్వటానికి ముందుకు వచ్చేవారు తమ అంగీకారాన్ని శాఖా గ్రంథాలయ అధికారులకు తెలియజేయాలని కోరారు. శిక్షణా తరగతులు విజయవంతం చేయడానికి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు,దాతలు సహకరించాలని వారు కోరారు. **రామచంద్రపురం**: తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలోని ద్రాక్షారామ శాఖా గ్రంథాలయంలో ఈనెల 28. నుంచి జూన్ 6 వరకు పాఠశాలల విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నామని గ్రంథాలయ అధికారి సూరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్యార్థులకు ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి ఉదయం 11 వరకు విద్యార్థులకు కథలు చెప్పడం, కథలు చదవడం, చిత్రలేఖనం, పేపర్ క్రాఫ్ట్, సంగీతం తదితర అంశములలో ప్రతిరోజు శిక్షణ ఇస్తారన్నారు. ద్రాక్షారామం గ్రామం పరిసర ప్రాంతంలో గల పాఠశాల విద్యార్థిని విద్యార్థులందరూ ఈ వేసవి విజ్ఞాన శిబిరం సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. **ఆత్రేయపురం:** మండల కేంద్రం ఆత్రేయపురం శాఖ గ్రంథాలయంలో సోమవారం 28 తేదీ నుంఎతీ జూన్ నెల 6వ తేదీ వరకు వేసవి విజ్ఞాన తరగతులు నిర్వహిస్తున్నట్లు గ్రయావలయ నిర్వాహకుడు తమ్మ నమశ్శివాయ తెలిపారు. విద్యార్థులకు కథలు వినే నైపుణ్యం, పుస్తకాలు చదవడం, పుస్తక సమీక్ష మరియు చిత్రలేఖనం, పేపర్ క్రాఫ్ట్, చెస్, క్విజ్, జనరల్ నాలెడ్జ్ అంశాలపై ప్రతిరోజు విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులందరూ ఈ వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవడానికి గ్రంథాలయానికి వచ్చి ఈ వేసవి విజ్ఞాన తరగతులను జయప్రదం చేయవలసిందిగా ఆయన కోరారు . ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులందరికీ ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు

వేట నిషేధ భృతి పెంపుపై హర్షం

ప్రజాశక్తి - రామచంద్రపురం

కూటమి ప్రభుత్వం గంగపుత్రులకు ఇచ్చిన ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఇచ్చే భృతి రూ.10 వేల నుంచి 20 వేలకు పెంచుతూ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు తీసుకున్న నిర్ణయం పై రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ సంవత్సరం ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు 61 రోజులపాటు ఉండే చేపల వేట నిషేధ కాలంలో మత్స్యకారులు వేటకు వెళ్ళకుండా ఇంటికే పరిమితం కావలసి ఉంటుందన్నారు. ఆ సమయంలో మత్స్యకారుల జీవనం కోసం, వారి కుటుంబాలకు ఇచ్చే భృతి రెట్టింపు చేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుని, రాష్ట్రంలోని 1,29,178 మంది మత్స్యకార కుటుంబాలకు లబ్ది చేకూరుస్తుందని అన్నారు. మత్యాకారులకు నేరుగా వారి ఖాతాల్లో రూ.20 వేలు చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం రూ.259 కోట్లు జమ చేశారని వివరించారు. అదేవిధంగా చేపల వేట సమయంలో మత్స్యకారులు మరణిస్తే రూ.10 లక్షల పరిహారం చెల్లిస్తున్నామని, వేటకు వెళ్ళే మర పడవలకు 3 వేల లీటర్లు,(మోటార్ బోట్లకు 300 లీటర్ల చొప్పున) లీటర్ కు రూ.9 చొప్పున డీజల్ రాయితీ ఇస్తున్నారని అన్నారు. మత్స్యకారులు ఎక్కువగా ఉన్న మన రాష్ట్రంలో ఆర్థికంగా నిలదొక్కకుంటారని మంత్రి సుభాష్ అన్నారు. మన రాష్ట్రంలో 555 మత్స్య గ్రామాలు ఉన్నాయని, మత్స్య ఉత్పత్తుల ద్వారా 16.50 లక్షల మంది ఉపాధి పొందుతున్నారు అని పేర్కొన్నారు. దేశంలో ఉత్పత్తి అయ్యే మత్స్య సంపదలో 29 శాతం ఉండగా, 32 శాతం ఉత్పత్తులు ఎగుమతులు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం కంటే మిన్నగా మత్స్యకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందనటంలో ఎలాంటి సందేహం లేదని మంత్రి సుభాష్ వెల్లడించారు.

నిరుద్యోగుల పట్ల చిత్తశుద్ధితో ప్రభుత్వం పనిచేస్తుంది

రావులపాలెం: ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం నిరుద్యోగుల పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తుందని రాష్ట్ర కార్మిక, ఫ్యాక్టరీలు,బాయిలర్లు, బీమా వైద్య సేవల మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆదివారం మండల పరిధి గోపాలపురంలోని హైటెక్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రైనింగ్ అండ్ టెస్టింగ్, మాస్టర్ మేన్ పవర్ కార్పొరేషన్ నిర్వాహకులు గుబ్బల సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఆసంస్థను స్థానిక ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావుతో కలిసి మంత్రి వాసంశెట్టి సుభాష్ సందర్శించారు. ఈ సందర్భంగా నిరుద్యోగులకు వివిధ విభాగాల్లో శిక్షణ ఇచ్చే విధానాన్ని మాస్టర్ గుబ్బల సూర్యనారాయణ మంత్రి సుభాష్‌కు వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గత ఐదేళ్లలో చేసిన అవినీతి బయటపడుతుందనే భయంతో జగన్ అసెంబ్లీకి రావడం లేదన్నారు. గత 11 నెలలుగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారధ్యంలో కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతుందన్నారు. హైటెక్ స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ ద్వారా వందలాది మందికి శిక్షణ ఇచ్చి దేశ విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న సూర్యనారాయణను మంత్రి అభినందించారు. వీరికి అన్ని విధాలా ప్రభుత్వం సహకారం అందిస్తుందని రానున్న రోజుల్లో అనేక మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆకాంక్షించారు. విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, యువనేత బండారు సంజీవ్, అధికారి నాగు, సోషల్ వర్కర్ దొమ్మేటి నారాయణ మూర్తి, గుబ్బల సుబ్రహ్మణ్య కుమార్, దొమ్మేటి కిషోర్, దొమ్మేటి శ్వేత, రిటైర్డ్ డియస్‌పి బొక్కా వెంకటరత్నం, కూటమి నాయకులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

నేరాలు ఘోరాలు

అంతరాష్ట్ర నేరస్తుల అరెస్ట్
రూ.40 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

ప్రజాశక్తి - అమలాపురం

ముగ్గురు అంతరాష్ట్ర నేరస్తులను ఆదివారం అరెస్ట్ చేసి వారిని నుంచి రూ.40లక్షలు విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. దీనికి సంబంధించి ఎస్‌పి బి.కృష్ణారావు వివరాలు వెల్లడదించారు. నరసరావుపేట మండలం పమిడిపాడు గ్రామానికి చెందిన జంగా వెంకట్రావు, రాజుపాలెం మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన దమ్ము సుధాకర్, గుంటూరు అర్బన్ జిల్లా కు చెందిన కాట్ల కిషోర్ బాబులు ఇంటి తలుపుల టవర్ బోల్ట్‌ను తీసి లేదా ఐరన్ రాడ్ తో తలుపు గెడను తీసి నేరం చేయడంలో నేర్పరులని అన్నారు. అమలాపురం పట్టణం కురసాల వారి వీధిలో ఒక డాబా ఇంటిలో జనవరి 12న రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ఇంటి తలుపు బోల్ట్ తీసి ఇంటిలోనికి ప్రవేశించి యజమాని గదిలో నిద్రిస్తున్న సమయంలో బీరువాలోని బంగారు నగలు, నగదు దొంగలించుకొని పోయారని అన్నారు. దీనిపై అమలాపురం పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశామన్నారు. ఈ ముగ్గుర్ని నరసాపురం వద్ద ఆదివారం అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.40 లక్షల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌పి తెలిపారు. వీరి నుంచి 400 గ్రాములు బంగారం, 500 గ్రాములు వెండి, ఆరు సెల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిపై రావులపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కేసు, అమలాపురం టౌన్ స్టేషన్‌లో మూడు కేసులు, తూర్పుగోదావరిలో రెండు, ఏలూరులో మూడు, గుడివాడలో ఒకటి, నంద్యాలలో రెండు, కడపలో ఒకటి, కర్నూల్‌లో ఒకటి, అనంతపురంలో ఒకటి, వెస్ట్ గోదావరిలో ఒకటి, అన్నమయ్య జిల్లాలో ఒక కేసు నమోదయిందని ఎస్‌పి చెప్పారు. సుమారు 13 నేరాల్లో వీరు నిందితులుగా వున్నారన్నారు. వీటితో పాటు మరో నాలుగు కేసుల్లో నిందితులని ఎస్‌పి తెలిపారు. నిందితులు అమలాపురం కురసాల వారి వీధిలో 2024 ఒక చోరీ, అమలాపురం గాంధీనగర్‌లో 2023లో మరొక చోరీ చేశారన్నారు. ఈ కేసును అమలాపురం డిఎస్‌పి టియస్ఆర్‌కె.ప్రసాద్, పట్టణ సిఐ పి. వీరబాబు, అమలాపురం టౌన్ క్రైమ్ సిఐ ఎం.గజేంద్ర, పట్టణ ఎస్ఐ కిషోర్ బాబు సిబ్బందిని ఎస్‌పి బి.కష్ణారావు అభి నందించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - కొత్తపేట

అనుమతి లేకుండా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు, రెవెన్యూ అధికారులు ఆదివారం సీజ్ చేశారు. వివరాలు ఇవి.. అందిన సమాచారంపై ఎస్ఐ జి.సురేంద్ర, సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది కలిసి మోడెకుర్రు ఆంజనేయస్వామి గుడి ఎదురుగా ఆదివారం ఉదయం వాహనాలను తనిఖీ చేస్తున్నారు. అమలాపురం వైపు నుంచి వస్తున్న ఆలమూరు మండలం నర్సిపూడి గ్రామం చెందిన వ్యాన్‌ను తనిఖీ చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా రేషన్ బియ్యం తరలిస్తున్నందున ఆ వ్యాన్ ను సీజ్ చేశారు. వ్యాన్‌లోని 73 బస్తాల రేషన్‌బియ్యం (3వేల కేజీలు) స్వాధీనం చేసుకున్నారు. దీనిపై ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడిపందేలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని కొడవలి గ్రామ శివారు కొండ వద్ద నిర్వహిస్తున్న కోడిపందెం శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో రెండు కోడి పుంజులు, రూ.4,300 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురు వ్యక్తులను అదుపులో తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

ఆటో డ్రైవర్ హత్య

ప్రజాశక్తి - కాకినాడ

మద్యానికి డబ్బులు ఇవ్వలేదనే కోపంతో తోటి స్నేహితులే ప్రాణం తీసిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...స్థానిక రేచర్లపేటలో గంజాయి మత్తులో ఉన్న నలుగురు వ్యక్తులు వారి స్నేహితుడైన గౌతమ్ (27)ను మద్యానికి డబ్బులు అడిగారు. తన దగ్గర డబ్బులు లేవని చెప్పడంతో అతనిపై రాళ్ళతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. కుటుంబ సభ్యులు అతనిని జిజిహెచ్‌కు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టిప్పర్ ఢీకొని నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మోటారుసైకిల్, టిప్పర్ లారీ ఢీ కొన్న ఘటనలో నలుగురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఐ.పోలవరం మండలం టీ కొత్తపల్లికి చెందిన ఉందుర్తి బాలు, కాకినాడ గొల్ల పాలేనికి చెందిన ఖండవల్లి రాజా, అయినవిల్లి మండలం శంకరాయ గూడెంనకు చెందిన నిడుమోలు ఉమామహేశ్వరరావు, టి.కొత్తపల్లి కి చెందిన బొమ్మి వినోద్‌లు ఆదివారం యానం నుండి ఒకే మోటార్ సైకిల్ పై తిరిగి వస్తున్నారు. ఈ సమయంలో జాతీయ రహదారి216 పై అన్నంపల్లి టోల్ ప్లాజా వద్ద ఎదురుగా వస్తున్న వీరి మోటార్‌సైకిల్‌ను టిప్పర్ లారీ ఎదురుగా ఢీ కొంది. ఈ ప్రమాదానికి నలుగురు గాయపడ్డారు. వారిలో ఉందుర్తి బాలు పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. గాయపడిన వారిని అంబులెన్స్ లో అమలాపురం ఆసుపత్రి తరలించారు ఈ మేరకు ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలా సాగర్ కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - నల్లజర్ల

పుల్లలపాడు 16 నంబరు జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. స్థానికులు బంధువులు తెలిపిన వివరాల ప్రకారం దేవరపల్లి గ్రామానికి చెందిన, దాసు దుర్గాప్రసాద్, అంజి, మరో వ్యక్తి కలసి శనివారం రాత్రి పాదయాత్రగా ద్వారకాతిరుమల చిన వెంకన్న సన్నిధికి రోడ్డుపై నడిచి వెళుతున్నారు. నల్లజర్ల మండలం పుల్లలపాడు వద్ద లారీ ఢీకొట్టడంతో దాసు దుర్గాప్రసాద్‌కు తీవ్ర గాయాలు కాగా, అంజి, మరో వ్యక్తికి స్వల్ప గాయాలు అయ్యాయి. దుర్గాప్రసాద్‌ను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అంజి మరో వ్యక్తి రాజమండ్రి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ

ప్రజాశక్తి - ఆత్రేయపురం

కాశ్మీర్‌లో పహల్గాంలోని. పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడిని ఖండిస్తూ ఆదివారం రాత్రి మండలంలోని లొల్ల గ్రామ ప్రజలు కాలువ రేవు నుంచి వాడపల్లి స్వతంత్ర సమరయోధుల స్తూపం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రముఖ కూడళ్లలో మానవహారం నిర్వహించారు. ఉగ్రవాదం నశించాలంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.


కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న లొల్ల గ్రామస్తులు

గుండెపోటుతో ప్రధానోపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ర్యాలి గ్రామంలో మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేగేశ్న సత్యనారాయణ రాజు (52) ఆదివారం ఉద యం ఆత్రేయపురంలో ఆయన స్వగృహంలో గుండెపోటుతో మరణించారు. ఆయన మృతి పట్ల మండల విద్యాశాఖ అధికారులు, యుటిఎఫ్ ఆత్రేయపురం మండల శాఖ నాయకులు సంతాపం తెలిపారు. మృతుని కుటుం బానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయనకు భార్య, ఒక కుమార్తె ఉన్నారు.


సత్యనారాయణరాజు (ఫైల్)

ప్రమాదకరంగా రహదారి వంతెన

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండల కేంద్రమైన కపిలేశ్వరపురం నుంచి మాచర వెళ్లే గ్రామ శివారులోని పంట కాలువ పై నిర్మించిన రహదారి వంతెన ప్రమాదకరంగా మారింది. ఈ రహదారి మలుపులో ఉన్న ఈ వంతెన కు రక్షణ గోడ కుడి, ఎడమ వైపు రక్షణ గోడ కూలింది. రహదారి పక్కన ఏర్పడిన గుంతలో ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు, వాహనదారులు, రైతులు భయభ్రాంతులకు గురవుతున్నారు. రాత్రి సమయాల్లో ఈ వంతెన మలుపు తిరిగే క్రమంలో ఆదమరచి పక్కకు వెళితే పంట కాలువలోకి వాహనాలతోపాటు బాటసారులు పడిపోయే ప్రమాదం ఏర్పడుతుంది. ఈ వంతెన మలుపు తిరిగే సమయంలో ఎప్పుడు ఏ ప్రమాదం ఎదురవుతుందో అని తెలియని పరిస్థితి . ఈ వంతెన రహదారి మలుపు మీదుగా కపిలేశ్వరపురం నుంచి శ్రీరాంపురం, మాచరమట్టలు, మాచర, టేకి, కోరుమిల్లి, వెళ్లే గ్రామాల ప్రజలు ప్రతినిత్యం వాహనాల రాకపోకలతో ఈ రహదారి రద్దీగా ఉంటుంది. రైతులు పంట పొలాలకు వెళ్లాలన్న ఈ రహదారి మీదుగానే వెళ్లాల్సి వస్తుంది. సంబంధిత అధికారులు స్పందించి ఈ మలుపులో ఉన్న వంతెన కు రక్షణ గోడ పటిష్టంగా నిర్మించాలని, రహదారి మలుపులో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని గ్రామస్తులతో పాటు ప్రయాణికులు, వాహనదారులు, రైతులు, కోరుతున్నారు .


ప్రమాదకరమైన మలుపులో ఇరువైపులా విరిగిన రక్షణ గోడలు


చొప్పెల్ల లో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ చంద్రకళ

300 మందికి ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - ఆలమూరు

చొప్పెళ్లలో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరంలో 300 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. కమ్యునిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(ది పిఎంపి అసోసియేషన్) ఆధ్వర్యంలో మండలంలోని చొప్పెల్ల మెయిన్ ఎంపిపి పాఠశాల ఆవరణలో రాజమండ్రికి చెందిన సుభద్ర హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఆదివారం సర్పంచ్ దంగేటి చంద్రకళ బాపనయ్య ప్రారంభించగా, సుమారు 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పల్లెల్లో పేదల ఆరోగ్య సంరక్షణకు ఇటువంటి వైద్య శిబిరాలుఉపకరిస్తాయని అన్నారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ ఆకుల దుర్గా ప్రసాద్, డాక్టర్ పద్మిని లు హాజరై వైద్య సేవలందించారు. ఉచితంగా ఎముకల సాంద్రత పరీక్షలు, ఇసిజి పరీక్షలు, రక్త పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరానికి వచ్చిన వారికి చొప్పెల్ల ఆర్యవైశ్య సంఘం మజ్జిగ చలివేంద్రాన్ని నిర్వహించారు. మండల పిఎంపి కన్వీనర్ ఏడిద లక్ష్మణాచార్యులు సారథ్యంలో ఈ వైద్య శిబిర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు కోన సత్యనారాయణ, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర మీడియా కన్వీనర్ బళ్ళా శ్రీనివాసరావు, టిడిపి మండల అధ్యక్షులు, డిసి ఛైర్మన్ మెర్ల గోపాలస్వామి, జనసేన మండల అధ్యక్షులు సూరపురెడ్డి సత్య, టిడిపి గ్రామ అధ్యక్షుడు బళ్ళ హరికృష్ణ, రాష్ట్ర వికలాంగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఏడిద లక్ష్మీనరసింహాచార్యులు, పిఎంపిలు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నాగేశ్వరరావు ఎంపికపై హర్షం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ముమ్మిడివరం జూనియర్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా వడ్డీ నాగేశ్వర రావు ఎన్నిక కావడం పట్ల కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.ఉదయ భాస్కర వర్మ హర్షం వ్యక్తం చేశారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక బాలయోగి కాలువ రోడ్ లోని నాగేశ్వర రావు ఆఫీస్ లో ఆదివారం వర్మ ఆయనను కలిసి దుశాలువా కప్పి సత్కరించి, అభినందించారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ గా అందరి మన్ననలు పొందాలని ఆకాంక్షించారు.

నూకాంబిక ఆలయ అభివృద్ధికి దాతల విరాళం

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని చింతలూరు శ్రీనూకాంబికా అమ్మవారి దేవస్థానంలో అభివృద్ధి పనుల నిమిత్తం ఆదివారం మురమళ్ళకు చెందిన నలమాటి త్రినాథరావు, శ్రీలత దంపతులు రూ. 50,116లు విరాళంగా అందించారు. దీంతో దాతలను ఇఒ ఉండవల్లి వీర్రాజు చౌదరి సత్కరించారు. దేవస్థానంలో జరుగుతున్న రాజగోపురాలు, తదితర నిర్మాణాల నిమిత్తం భక్తులు విరివిగా విరాళాలు అందించాలని ఈవో ఉండవల్లి వీర్రాజు చౌదరి ఈ సందర్భంగా కోరారు.

అమ్మవారికిరూ.4.5లక్షల విలువైన వెండి ఆభరణాల అందజేతలి

నూకాంబికా అమ్మవారికి దాతల సహకారంతో సేకరించిన 4.25 కేజీల వెండితో రూపొందించిన రూ.4.50 లక్షల విలువైన ఆభరణాలను ఆదివారం గ్రామానికి చెందిన మహిళలు ఆలయ కమిటీ అందజేశారు. మండపేటకు చెందిన ప్రముఖ శిల్పి వాసా శ్రీనివాస్ ఈ ఆభరణాలు రూపొందించారు. ఆదివారం చైత్ర అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని నూతనంగా రూపొందించిన అమ్మవారి కుడి చేతి కవచం, పిడికిలి ఆభరణాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి అలంకరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఇఓ ఉండవల్లి వీర్రాజు చౌదరి, అల్లంరాజు రామకృష్ణమూర్తి, ఆలయ ఉత్సవ కమిటీ ఛైర్మన్ గన్ని వెంకట్రావు, వైట్ల శేషుబాబు, ఏ.శివన్నారాయణ, దాసరి సుబ్బారావు, పలువురు మహిళలు పాల్గొన్నారు.


విరాళం ఇచ్చిన దాతలను అభినందిస్తున్న ఇఒ వీర్రాజు చౌదరి

రాష్ట్రంలో శాంతి భద్రతలు లోపించాయి

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తి గా లోపించాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ఛైర్మన్ కామన ప్రభాకరరావు విమర్శించారు. కర్నూలు జిల్లా ఆలూరు నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త చిప్పగిరి లక్ష్మీ నారాయణను దారుణంగా హత్య చేయడం పట్ల ప్రభాకరరావు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. లక్ష్మినారాయణ ప్రయాణిస్తున్న కారును టిప్పర్ తో ఢీ కొట్టి దారుణంగా హతమార్చడం హేయ మైన చర్య అని అన్నారు. ఈ ఘాతుకానికి పాల్పడిన హంతకులను తక్షణం అరెస్ట్ చేసి జ్యుడిషియల్ విచారణ చేపట్టాలని ప్రభాకరరావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ నేతలకు తక్షణం రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. వీటిపై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, హోమ్ శాఖ మంత్రులు దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

సూర్యనారాయణకు కందుకూరి పురస్కారం

ప్రజాశక్తి - రామచంద్రపురం

అల్లూరి సీతారామరాజు స్మారక కళావేదిక ప్రతి ఏటా వార్షికోత్సవ సందర్భంగా ఇచ్చే ప్రతిష్టాత్మకమైన కందుకూరి రంగస్థల పురస్కారం ఈ సంవత్సరం కె.గంగవరం మండలం అముజూరు గ్రామానికి చెందిన నటులు, దర్శకులు కళాపోషకులు మరివాడ సూర్యనారాయణకి ఆదివారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సన్మాన కార్యక్రమంలో ద్రాక్షారామ నాటక కళా పరిషత్ అధ్యక్షులు హసన్ బాద గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు, పరిషత్ కోశాధికారి వేమవరపు రాంబాబు, పరిషత్ సభ్యులు బిఎల్.నారాయణ, గొర్రెలరాము, సాయిబాబు అభిమానులు పాల్గొని సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎపి నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాల కృష్ణ , అనపర్తి ఎంఎల్ఎ రామకృష్ణారెడ్డి , ఎంఎల్‌సి పి.రాజశేఖర్, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, ఆంధ్రప్రదేశ్ నాటక సమాజాల అధ్యక్షులు బుద్దాల వెంకట రామారావు తదితరులు పాల్గొన్నారు. కళావేదిక అద్యక్షులు కర్రి అత్చుత రామారెడ్డి వ్యవస్థాపక కార్యదర్శి పంపన దయానంద బాబు ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల నాటక సమాజాల అధ్యక్షులు నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాల కృష్ణకి పరిషత్ నిర్వహణల గురుంచి ఆర్థిక సహకారం కొరకు వినతి పత్రం అందజేశారు.


పురస్కారం ప్రదానం చేస్తున్న ప్రముఖులు

నేటి నుంచి విద్యార్థులకు వేసవి శిక్షణ

ప్రజాశక్తి-గోపాలపురం

గోపాలపురం శాఖా గ్రంథాలయంలో సోమవారం నుంచి జూన్ 6వ తేదీ వరకు విద్యార్థినీ విద్యార్థులకు వేసవి సెలవుల సందర్భంగా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ వి.సత్యనారాయణ ఆదివారం తెలిపారు. ఈ శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రతి ఒక్క తల్లిదండ్రులు వారి పిల్లలను స్థానిక గ్రంథాలయానికి పంపించాలని కోరారు. ఉదయం 8 గంటల నుండి 12 గంటల వరకు 40 రోజుల వరకు నిర్వహిస్తామని సద్వినియం చేసుకోవాలని తెలిపారు.

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్

ప్రజాశక్తి - సీతానగరం

సాధన స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం పురుషోత్తపట్నంలోని సాధన క్యాంపస్‌లో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించారు. 10వ తరగతి, ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు తదుపరి చదువుల కోసం అందుబాటులో ఉన్న వివిధ కోర్సులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సాధన చీఫ్ కౌన్సిలర్ పసలపూడి రాజీవ్ కుమార్ మాట్లాడుతూ, 10వ తరగతి విద్యార్థులకు ఇంటర్మీడియట్ సాంప్రదాయ కోర్సులతో పాటు పాలిటెక్నిక్, డిప్లొమా, పారా మెడికల్, ఐటిఐ, ఒకేషనల్ కోర్సుల్లో 50కి పైగా అవకాశాలు ఉన్నాయని వివరించారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులకు డిగ్రీ స్థాయిలో 60కి పైగా కోర్సులు అందుబాటులో ఉన్నాయని, ఎంసెట్, నీట్, ఐఐటి ట్రిపుల్ ఐటి వంటి పరీక్షల ద్వారా ఇంజనీరింగ్, మెడికల్, ఇతర రంగాల్లో ఉన్నత విద్యను అభ్యసించవచ్చని తెలిపారు. సాధన మండలి అధ్యక్షురాలు పి.సుజ్ఞాన కుమారి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ చక్కని ప్రణాళికతో స్పష్టమైన లక్ష్యాలను ఏర్పరచుకుని భవిష్యత్తులో మంచి ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సాధనా మహిళా మండలి చీఫ్ అడ్వైజర్ పసలపూడి వెంకటరత్నం, 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పురుషోత్తపట్టణం, రామచంద్రపురం, నెలకోట గ్రామాలకు, తొర్రిగడ్డ ఎత్తిపోతల పథకానికి సోమవారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. 11 కెవి పోలవరం కెనాల్ ఫీడర్ బ్రేకర్ నిర్మాణ పనుల కారణంగా ఈ అంతరాయం ఏర్పడుతుందని, విద్యుత్ వినియోగదారులు ఈ అసౌకర్యానికి సహకరించాలని కోరారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి

ప్రజాశక్తి - మామిడికుదురు

గ్రామీణ ప్రాంతాలలో హెల్త్ క్లినిక్ లలో విధులు నిర్వహిస్తున్న ఆయుష్మాన్ భారత్ వైద్య సిబ్బంది తమకు ఉద్యోగ భద్రత కల్పించాలంటూ నగరం పిహెచ్‌సి సిహెచ్‌ఒ సత్యవతికి వినతి పత్రం అందజేశామని ఆదివారం వారు తెలిపారు. గత రెండేళ్ల నుంచి పెరిగిన ధరలతో ఆర్థికేతర సమస్యలతో సతమతమవుతున్నామని ప్రధానమైన ఎనిమిది డిమాండ్లు పరిష్కరించి న్యాయం చేకూర్చాలని వైద్య కమిషనర్‌కు అసోసియేషన్ తరపున సమస్యలు విన్నవించామన్నారు. వైద్య కమిషనర్ స్పందించలేని కారణంగా కారణముగా ఈనెల 28 నుంచి నిరవధిక సమ్మె చేయాలని నిర్ణయించినట్లు వినతి పత్రంలో పేర్కొన్నారు.



వినతి పత్రం ఇస్తున్న గ్రామీణ ఆయుష్మాన్ భారత్ ఉద్యోగులు